క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గోవింద నామాల పారాయణ


గోవింద నామాల పారాయణ

చీరాల అర్బన్: పట్టణంలోని పాపరాజుతోటలోని రాధాకృష్ణ మందిరంలో ప్రతిరోజు శ్రీ వేంకటేశ్వర స్వామి గోవింద నామాలు 11 సార్లు పారాయణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. 41 రోజులు పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మందిర కమిటీ అధ్యక్షుడు నల్లూరి బ్రహ్మం తెలిపారు. సీతారామాంజనేయ షణ్ముఖ మహిళా సమాజం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం
మార్టూరు: మండలంలోని కోలలపూడి గ్రామ శ్రీ రామాలయం 12వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం, హరే రామ కీర్తనలు ఆలపించారు.

కుష్టు వ్యాధిగ్రస్తులు పరిశుభ్రత పాటించాలి


వ్యాధిగ్రస్తులకు దుప్పట్లు అందిస్తున్న రమాదేవి

వేటపాలెం: కుష్టు వ్యాధిగ్రస్తులు తప్పని సరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డీఎల్‌ఓ సీవీ రమాదేవి సూచించారు. రామన్నపేట పంచాయతీ శివారులో గల లెప్రసీ కాలనీని డీఎల్‌ఓ బుధవారం సందర్శించారు. వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత శుభ్రతపై సూచనలు చేశారు. ప్రతి నెలా రెండో బుధవారం 104 వాహనం కాలనీకి వస్తుందని.. ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న వారు ప్రభుత్వం అందిస్తున్న రూ. 10 వేల పింఛను కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనంతరం ఉచితంగా దుప్పట్లు, మందులు పంపిణీ చేశారు. డీఎస్‌ఎంఓ సాదిక్ మహ్మద్, డాక్టర్ సాయి వైష్ణవి, డీపీఎంఓ హసన్, సుబ్బరాజు, హెచ్‌ఎస్ సుధాకర్, రజిని పాల్గొన్నారు.

భీమవరంలో నేత్రదానం


మృతుడు అన్నెం కొండయ్య (ఫైల్)

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన అన్నెం కొండయ్య మృతి చెందడంతో బుధవారం ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానం చేసేందుకు అంగీకరించారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు అవయవ దాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర్ నేత్రాలయం వైద్యులు మృతుని కార్నియాలు సేకరించారు. మృతుని కుమారుడు రాఘవయ్య, కోడలు లక్ష్మి, మనవడు శ్రీమన్నారాయణ, మనుమరాలు రజినీకి అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు (స్వామి), క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రఫీ, కార్యదర్శి చుండి సాంబశివరావులు అభినందనలు తెలియజేశారు. రోటరీ ఆధ్వర్యంలో ఇది 558వ నేత్రదానంగా సభ్యులు తెలిపారు.

తెగుళ్ల నుంచి రక్షణ పొందాలి


నారుమళ్లను పరిశీలిస్తున్న ఏవో కుమారి

బల్లికురవ: ప్రధాన పొలంలో వరి నారు నాటే వారం ముందు నారుమడిలో కార్బోఫ్యురాన్ గుళికలను చల్లి పీకి నాటుకుంటే కొన్ని రకాల తెగుళ్ల నుంచి పంటను రక్షించుకోవచ్చని ఏవో కుమారి చెప్పారు. మంగళవారం మండలంలోని కొత్తూరు, వెలమవారి పాలెంలో సాగు చేసిన మొక్కజొన్న, వరి నారు మడులను సందర్శించారు. గుళికలు వేసేటప్పుడు మడిలో తక్కువ నీళ్ళు ఉండాలన్నారు. వివరాలు తెలియజేసి ఈ క్రాప్ నమోదు చెన్నకేశవ రెడ్డి, ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

తరగతి పరిశీలన పూర్తి చేయండి


మాట్లాడుతున్న ఎంఈవో సుధాకర్

అద్దంకి: వారానికి రెండు చొప్పున నెలకు 8 వంతున ఉపాధ్యాయులు బుధవారం నుంచి తరగతి పరిశీలన పూర్తి చేయాలని ఎంఈఓ బి. సుధాకర్ అన్నారు. టీచ్ టూల్ । ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించారు. విద్యాశాఖాధికారి మాట్లాడుతూ టెక్నికల్ సమస్యలు ఉంటే మాస్టర్ ట్రైనీలుగా ఉన్న హెచ్ఎం నాగేశ్వరావు, ఉపాధ్యాయులైన మల్లికార్జున రావు, ధనలక్ష్మి సలహాలు తీసుకోవాలన్నారు.


చీరాల గడియార స్తంభం సెంటర్‌లో మానవహారం


పంగులూరులో వర్గీకరణకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం


చీరాల ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

భారత్ బంద్ ప్రశాంతం

- బంద్‌కు మిశ్రమ స్పందన
- యథావిధిగా పలు ప్రభుత్వ కార్యాలయాలు

చీరాల: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా చేపట్టిన భారత్ బంద్ చీరాలలో ప్రశాంతంగా జరిగింది. ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చీరాల ఆధ్వర్యంలో బుధవారం బంద్‌ను నిర్వహించారు. ఉదయం ఆర్టీసీ బస్టాండ్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో ఆర్టీసీ సర్వీసులు నిలిచిపోయాయి. అనంతరం స్థానిక గడియార స్తంభం సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను రాష్ట్రాలు చేసుకోవచ్చని సుప్రీం కోర్టు తాజాగా తీర్పు ఇచ్చిందన్నారు. 2004లో ఆర్టికల్ 341 ప్రకారం సుప్రీంకోర్టు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చెల్లదు అని కొట్టి వేశారని.. ఇప్పుడు మరలా వర్గీకరణ రాష్ట్రాలు చేసుకోవచ్చని తీర్పు ఇవ్వడం బాధాకరమన్నారు. ఒక వర్గీకరణే కాకుండా క్రీమీలేయర్ అనే పద్ధతి చేయాలని సూచించిందన్నారు. ఒక కుటుంబంలో ఏ ఒక్కరికి ఉద్యోగం వచ్చిన మిగిలిన వారికి రిజర్వేషన్ వర్తించదని, ఎవరైనా కుటుంబంలో రూ.70వేలకు పైగా జీతం పొందుతూ ఉంటే ఆ కుటుంబానికి కూడా రిజర్వేషన్ వర్తించదన్నారు. ఇదే జరిగితే ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్‌లను కాపాడుకునేందుకు దేశ వ్యాప్తంగా బంద్ చేపట్టినట్లు తెలిపారు. భారత్ బంద్ కారణంగా పట్టణంలోని విద్యా, వ్యాపార సంస్థలు, బ్యాంకులు మూతపడ్డాయి. ఆర్టీసీ సర్వీసులు మధ్యాహ్నం వరకు నిలిచిపోయాయి. చీరాల డిపో నుండి 75 సర్వీసులకు గాను 25 సర్వీసులు మాత్రమే నడిచాయి. పట్టణంలో బంద్ కారణంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


మార్టూరు స్టేట్ బ్యాంక్ సెంటర్లో పోలీసుల గస్తీ


వేటపాలెం సెంటర్‌లో బందో బస్తు నిర్వహిస్తున్న పోలీస్‌లు, ఎస్సై


కారంచేడులో బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్‌ఐ, పోలీసులు


చినగంజాంలో పోలీస్ బందోబస్తు పరిశీలిస్తున్న డీఎస్పీ జగదీష్ నాయక్

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం
జె.పంగులూరు: దేశవ్యాప్తంగా నిర్వహించిన భారత్ బంద్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పంగులూరులో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించన భారత్ బంద్ విజయవంతం అయింది. యువకులు పెద్ద ఎత్తున గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని పాఠశాలలను, బ్యాంక్‌లను, షాపులను మూసి వేయించారు. అనంతరం పంగులూరు పాత తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో దళితులకు కల్పించిన హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. వర్గీకరణ వెనక్కు తీసుకోకుంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. బొల్లా చెన్నయ్య, నరేంద్ర సభ్యులు పాల్గొన్నారు.

వేటపాలెం: ఎస్సీల వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు నిరసనగా బుధవారం చేపట్టిన భారత్ బంద్ వేటపాలెంలో పాక్షికంగా జరిగింది. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్, బ్యాంకులు, పోస్టాఫీసులను మూసివేయించారు. ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలు యథావిధిగా పని చేశాయి. ఎస్సై ఎం. వెంకటేశ్వర్లు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మేదరమెట్ల: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ కొన్ని దళిత సంఘాలు బుధవారం భారత్ బంద్‌కు పలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో మేదరమెట్ల గ్రామంలో బంద్ ప్రభావం ఎక్కడా కనిపించలేదు. దుకాణాలు, బస్సులు యథావిధిగా కొనసాగాయి. మేదరమెట్ల, కొరిశపాడు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బల్లికురవ: ఎస్సీ వర్గీకరణ తీర్పుకు నిరసనగా మంగళవారం భారత్ బంద్ కొప్పెరపాడులో నిర్వహించారు. బ్యాంక్, హైస్కూల్ తదితరాల కార్యాలయాల వద్ద నిరసనలు తెలియజేశారు. దమ్ము కోటేశ్వరరావు, దమ్ము గంగయ్య, దమ్ము ఆంజనేయులు, మనికె రామారావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు (చినగంజాం): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని కోరుతూ దళితులు చేపట్టిన భారత్ బంద్ పర్చూరులో ప్రశాంతంగా ముగిసింది. స్థానిక దళిత నాయకులు బొమ్మల సెంటర్‌లో వాహనాలు ఆపి ధర్నా నిర్వహించారు. పలు దుకాణాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులను మూసివేయించారు. నల్లబ్యాడ్జీలను ధరించి తమ నిరసనను తెలియజేశారు. ఎస్సీ వర్గీకరణను ఆపాలని వారు డిమాండ్ చేశారు. బొమ్మల సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి నినాదాలు చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని ఆర్‌ఐ ప్రేమ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వి. అబ్రహం, కె. మార్కు, ఎస్. కిషోర్, కె. ఇసాక్, కె. రత్నరాజు, జి. సాల్మన్, జి. స్వరాజ్ కుమార్, జే వంశీ, జె. రోశయ్య, వై. జయరాజ్, ఎం. డేవిడ్, కె. రాజేష్, చింతా సురేష్, ఎం. బెంజిమన్, అడే రాఘవ, బిళ్ళా అశోక్ కుమార్ పాల్గొన్నారు.

కారంచేడు: మండలంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, నిరసనలు జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టామని ఎస్‌ఐ వి. వెంకట్రావు అన్నారు. బుధవారం కారంచేడు కాలువ సెంటర్‌లో తమ సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. కుంకలమర్రు, స్వర్ణ, ఆదిపూడి, తిమిడెదపాడు, దగ్గుబాడు, కొడవలివారిపాలెం, స్వర్ణపాలెం, నందిగుంటపాలెంలో బందోబస్తు నిర్వహించామన్నారు.

అద్దంకి రూరల్: మాలమహానాడు, ప్రజా సంఘాలు దళిత సంగాల జేఏసీ ఆధ్వర్యంలో అద్దంకిలో గురువారం భారత్ బంద్ పాక్షికంగా నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ స్థానిక భవాని సెంటర్‌నుంచి బస్టాండ్ మీదుగా అంబేద్కర విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలను మూసివేయించారు. స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద మాలమహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు అంకం కిరణ్ కుమార్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో తీర్మానం లేకుండా ఆర్టికల్ 341 ను సవరించే అధికారం ఎవరికీ లేదన్నారు.

మార్టూరు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు బుధవారం ఇచ్చిన దేశవ్యాప్త బందు పిలుపు ప్రభావం మార్టూరులో పెద్దగా కనిపించలేదు. ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా పనిచేశాయి. సీఐ మద్దినేని శేషగిరిరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది స్థానిక స్టేట్ బ్యాంక్ సెంటర్ గన్నవరం సెంటర్, నాగరాజు పల్లి సెంటర్లలో జాతీయ రహదారి ఇరువైపులా గస్తీ నిర్వహించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

చినగంజాం: బంద్‌లో భాగంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. చీరాల డీఎస్పీ జగదీష్ నాయక్ ఆధ్వర్యంలో ఇంకొల్లు సర్కిల్ పరిధిలోని చినగంజాం, ఇంకొల్లు, కారంచేడు పోలీస్ స్టేషన్ పరిధిలో గట్టి బందోబస్తు నిర్వహించారు. ఇంకొల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, చినగంజాం ఎస్‌ఐ ఎస్. రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాం: భారత్ బంద్ చినగంజాం మండలంలో ప్రశాంతంగా ముగిసింది. బాపట్ల జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు మేడికొండ సునీల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం వచ్చిందంటే అందుకు మాలలు చేసిన పోరాటమే కారణమన్నారు. అనంతరం తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావుకు వినతి పత్రం అందజేశారు. వరికూటి బుల్లిబాబు, కవలదాసు, మేడికొండ చిన్న, గేరా నాగరాజు పాల్గొన్నారు.


నిరసన తెలియజేస్తున్న ప్రజలు


చినగంజాం: నిరసన తెలియజేస్తున్న దళిత నాయకులు


పర్చూరులో ధర్నా నిర్వహిస్తున్న దళిత నాయకులు


అద్దంకిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న మాలమహానాడు నాయకులు


మేదరమెట్ల బస్టాండ్ వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న మేదరమెట్ల ఎస్‌ఐ మహ్మద్ రఫీ

పంచాయతీ అవినీతిపై విచారణ వాయిదా


కారంచేడు పంచాయతీలో విచారణ కోసం వచ్చిన ఈఓపీఆర్డీ రమేష్‌బాబు

కారంచేడు: స్థానిక పంచాయతీలో నెలకొన్న అవినీతిపై బుధవారం ఈఓపీఆర్డీ విచారణకు వెళ్లగా.. సంబంధిత రికార్డులు అందుబాటులో లేకపోవడంతో విచారణ వాయిదా పడింది. వివరాలు.. 2019 అనంతరం పాలకవర్గం పదవీ విరమణ అయిన తరువాత వచ్చిన ప్రత్యేక అధికారుల పాలనలో అప్పటి గ్రామ కార్యదర్శి, ఇతర సిబ్బంది సుమారు రూ. 1 కోటి నిధులను వారి సొంత అకౌంట్‌లకు జమ చేసుకున్నారు. దీనిపై ఈ ఏడాది జూలై 8వ తేదీన కలెక్టర్‌కు పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై కారంచేడు ఈఓపీఆర్డీ రమేష్‌బాబును విచారణాధికారిగా నియమించారు. కాగా విచారణ నిమిత్తం అన్ని రికార్డులతో హాజరుకావాలని పంచాయతీ కార్యదర్శికి ఆగస్టు 14న నోటీసు జారీ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం పంచాయతీ కార్యాలయం వద్దకు ఆయన విచారణకు వచ్చారు. కానీ ప్రస్తుతం స్థానికంగా ఉన్న కార్యదర్శి సెలవుపై వెళ్లి.. ఇన్‌చార్జ్ కార్యదర్శిగా ఉన్న రాజమోహన్‌కు రికార్డులు అప్పగించలేదు. దీంతో విచారణకు అవసరమైన రికార్డులు తన వద్ద లేవని ఆయన లిఖిత పూర్వకంగా తెలిపారు. దీంతో విచారణకు వాయిదా వేస్తున్నట్లు ఈఓపీఆర్డీ వెల్లడించారు.

ఎక్కువ కేసుల పరిష్కారానికి చర్యలు


జడ్జిలతో జరిగిన సమీక్షలో న్యాయవాదులు

పర్చూరు (చినగంజాం): మండలంలో సెప్టెంబర్ 14న నిర్వహించబోయే లోక్ అదాలత్‌కు సంబంధించి పర్చూరు కోర్టు జడ్జిలు, న్యాయ వాదులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. పర్చూరు కోర్టు సీనియర్ జడ్జి కె. ప్రశాంతి, జూనియర్ సివిల్ జడ్జి పి. శాంతి మాట్లాడారు. ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా సహకరించాలని న్యాయవాదులను కోరారు. న్యాయవాదులు రావి సత్యనారాయణ, రావి రమేష్ బాబు, ఎం. రవీంద్రనాథరెడ్డి, కొల్లా నరేంద్ర, చాగంటి సుబ్బారావు, ఎం. వీరాంజనేయులు, పూర్ణిమిట్ట జాన్‌బాబు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ


శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

చీరాల రూరల్: జూనియర్ డాక్టర్ మౌమితను హత్యాచార ఘటన నిరసిస్తూ బుధవారం రాత్రి చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు పట్టణంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు. రమేష్‌బాబు, ఎంవీ చలపతిరావు, బండారుపల్లి హేమంత్‌కుమార్, ఆకిశెట్టి పుల్లయ్య నాయుడు, సజ్జా శ్రీనివాసరావు, సీహెచ్ మస్తాన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు సర్వే పరిశీలన


ఇంటింటికి తిరిగి సర్వే పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రభాకరరావు

చినగంజాం: మండలంలోని సోపిరాలలో ఇంటింటి ఓటరు నమోదు సర్వేను తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు బుధవారం పరిశీలించారు. ఓటరు జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025 కార్యక్రమంలో భాగంగా బుత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించారు. బూత్ స్థాయి అధికారులు ఆమంచి సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ ఇ. శ్రీనివాసరావు, ఎన్నికల కంప్యూటర్ ఆపరేటర్ వై. విజయకుమార్ పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రామ సభలు

మేదరమెట్ల: ఉపాధి హామీ పనులకు సంబంధించిన గ్రామ సభలు ఈనెల 23 నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఒకే రోజు గ్రామ సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాను సారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలకు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

వృద్ధాశ్రమానికి వితరణ


నూతలపాడులో టేబుళ్లు అందజేస్తున్న దాతలు

పర్చూరు (చినగంజాం): మండలంలోని నూతలపాడు ఆశ్రయ వృద్ధాశ్రమానికి దాతలు బుధవారం ఆరు డైనింగ్ టేబుళ్లను అందజేశారు. ఇంకొల్లు గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయ దంపతులు జెల్లి ప్రసాదరావు, అనసూయ.. ప్రపంచ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని సమకూర్చారు. ఆశ్రమ నిర్వాహకులు భవనం జయలక్ష్మి, రామ్మోహనరావు, సాయి పాల్గొన్నారు.

జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలి


స్వర్ణ ఇంటింటి ఫీవర్ సర్వేలో వైద్య సిబ్బంది

స్వర్ణ (కారంచేడు): వాతావరణంలో మార్పుల వల్ల వ్యాపిస్తున్న జ్వరాల పట్ల వైద్య సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్వర్ణ పీహెచ్‌సీ డాక్టర్ షాలిని అన్నారు. బుధవారం స్వర్ణ సచివాలయాల పరిధిలో ఫీవర్ సర్వేపరిశీలించారు. కాచి కల్లార్చిన నీటిని తాగాలన్నారు. హెచ్‌ఈఓ వి. నాగేశ్వరరావు, హెచ్‌ఈ మీనా కుమారి, హెచ్‌వీ మాధురీ సిఫోరా, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వృద్ధుల దినోత్సవం


వృద్ధుల ఆశ్రమంలో గోవిందస్వామిని సత్కరిస్తున్న కార్తీక్

చినగంజాం: సమాజంలో వృద్ధులకు సముచిత గౌరవం ఇవ్వాలని చినగంజానికి చెందిన పలువులు అన్నారు. బుధవారం ప్రపంచ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని స్థానిక వాల్మీకి వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులను గౌరవించే కార్యక్రమాన్ని చేపట్టారు. వారు మాట్లాడుతూ యువత.. పెద్దలను గౌరవించాలని, సమాజంలో వారికి ప్రత్యేక స్థానం ఇవ్వాలని, పెద్దల సలహాలను అడిగి వారిని అనుసరించాలన్నారు. ప్రభుత్వం రైళ్లలో, బస్సుల్లో, దేవస్థానాల్లో సీనియర్ సిటిజన్స్ ప్రత్యేక సౌకర్యాలను కల్పిస్తున్నట్లు వివరించారు. అనంతరం ఆశ్రమంలోని సీనియర్ సిటిజన్, సామాజిక సేవా కార్యకర్త ఎళుమలై గోవిందస్వామిని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. వృద్ధులకు భోజన కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు వారికి పండ్లు అందజేశారు. సాయికార్తీక్‌తో పాటు పలువురు యువకులు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి సాధ్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పులగం రజని

యద్దనపూడి: మండల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ కృష్ణకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ పులగం రజని అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు శాఖల పనితీరుకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, ఉపాధి కల్పన, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఎంపీడీఓ శివసుబ్రమణ్యంను ఘనంగా సన్మానించారు.

వారణాసి మరణం తీరని లోటు

చీరాల అర్బన్: బీజేపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ పలు పదవులు చేపట్టిన వారణాసి మల్లిఖార్జునరావు మరణం పార్టీకి తీరని లోటని పార్టీ అసెంబ్లీ కన్వీనర్ అరవపల్లి కుమార్, పార్టీ నాయకులు పేర్కొన్నారు. చీరాల పట్టణ అధ్యక్షునిగా, కార్యదర్శిగా, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా పలు పదవులు చేపట్టారన్నారు.ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మార్టూరు రూరల్ సీఐగా శ్రీనివాసరావు

పర్చూరు (చినగంజాం): మార్టూరు రూరల్ సీఐగా జీఎల్ శ్రీనివాసరావు నియమితులయ్యారు. బుధవారం బాధ్యతలను స్వీకరించారు. పర్చూరులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతి భద్రతలను కాపాడతానని తెలిపారు. పోలీస్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో పనిచేసిన సీతారామయ్య బాపట్ల జిల్లా ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

చీరాల రూరల్: చీరాల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వృద్ధుడు బుధవారం రాత్రి మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్సై సీహెచ్. కొండయ్య తెలిపారు. మంగళవారం రాత్రి చీరాల రైల్వే స్టేషన్‌లో స్పృహ కోల్పోయి పడిపోయిన వృద్ధుడిని చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు శరీరంపై తెలుపు రంగు నిండు చేతుల చొక్కా, నలుపు రంగు నిక్కరు ఉంది.